# కర్మఫలం

రచన:
కమలా శ్రీనివాస్

అబ్బా! ఈ అన్‌యెంప్లాయ్‌మెంట్ బాధ పరాయి వాడికైనావద్దు. ఈడిగ్రీ యెంతసొమ్ము మింగింది! మానాన్నచేత తాతలుగణించిన భూములూ, యిళ్లు అమ్మించింది. ఈ "నో వేకన్సీ" బోర్డులు చూసి చూసి కళ్లు నీళ్లుకారుస్తున్నాయి. ఏ ఆఫీసుకెళ్ళినా గుమాస్తా చేయిచాచటం—చేయినిండకపోతే అప్లికేషన్ తీగెలో గుచ్చేయటం. ఏమి అన్యాయం? బి. య్యే. అవటంచేత కడకు కూలిపనైనా పుట్టటం లేదు. గాదెల్లో గరిశలధాన్యంనిండే యిల్లు కడకు పిడికెడుబియ్యానికికూడ ముఖంవాచింది. చేయికాలిన తరువాత చేతిమట్టలు పట్టుకుంటే యేమిలాభం? ఈ డిగ్రీతెచ్చిన దారిద్ర్యం బాధపడలేక, మలమలమాడి మాఅమ్మ, మానాన్న, యీప్రపంచం వదిలీసేరు. మాఅమ్మ, నాన్న, చావుకి యీడిగ్రీ, యీడిగ్రీ కుండి నేను, కారణం అయ్యేం. నన్నుమాత్రం మిగిలిపోయినబాధలుపడటానికి దేముడు యింకాప్రాణంతో వుంచేడు. నా అదృష్టానికితోడు, నాలాంటి అభాగ్యుల్ని పోషించి యింత ఆధరువు చూపించడానికి యీ ప్రస్తుతయుద్ధం చాలామట్టుకు పుణ్యం కట్టుకుంది. "అన్‌యెంప్లాయ్‌మెంట్ ప్రశ్న" చాలా మట్టుకు సాల్వ్అయింది. ఏ ఆఫీసులోనూ విలువలేని యీపాడు డిగ్రీకి భగవంతుడు యీమూలాన్నికాస్త జీవంపోశేడు.

• • •

ఎండాకాలం—పదిగంటలైంది — సూర్యుడు ఆగ్రహించి తనతడాకా చూపిస్తున్నాడు—క్రింద కాళ్ళు, మీద బుర్ర మాడిపోతుంటే పాపం, పొట్ట కోసం యెంతకష్టమైన పనులైనా చేస్తున్నారు. నల్లశేనపురాయి—రాయి బ్రద్దలుకొడుతుంటే, అబ్బా! గుండె అదరుతూంది. ఆ రాళ్లకుప్పలదగ్గిర పని చేస్తూన్న ముక్కుపచ్చలారని పిల్లలూ, చావడానికి సిద్ధంగావున్న వృద్ధులూ చమట్లుకారుస్తూ పని చేయటం యీపాడుపొట్ట పోషించుకోడానికేకదా! నిప్పులుకక్కుతూన్న యెండలో వాళ్ళ అవస్థలు చూస్తూంటే నాగుండె తిమ్మిరెక్కింది.

ఆశ్చర్యం! కాళ్ళు కదలటంలేదు—జానికా అచ్చే! ఐవుండదు. అంతగొప్పింటిపిల్ల రాళ్లకుప్పల దగ్గిర మెట్లంగికొట్టడం యేమిటి? అందరూ నాలాంటి నిర్భాగ్యులేవుంటారా! శ్రీనిపోలిన శ్రీవుంటుంది. ఏమో! ఎంతచెట్టుకంతగాలి వుంటుంది. ఉద్యోగ రీత్యా బంధింపబడ్డంచేత కాళ్ళు తమద్యూటీ తాము చేయడం ప్రారంభించేయి. మనోవేగం వాయువేగం కన్నా అతిత్వరితంగా పరుగెడుతూంది. నాసీటులో కూర్చుండి అరియర్స్‌లోవున్న పన్ని టైప్‌రైటర్ మీద చేయడం మొదలెట్టేను. నా టైపింగు రాళ్ళ కుప్పలదగ్గిర రాళ్ళు ముక్కలుకొడుతూన్న ఆ అనుమాన జానకి సుత్తిదెబ్బలు గుండెఅను రాయిన మొత్తుచటుమలె నుండెను.

నా జానకి నన్ను మరచివుంటుంది. ఒకవేళ చూసినా పోల్తిపట్టలేదేమో! ఏ గొప్పయింటనోపడి భోగభాగ్యాలలో తులతూగే ఆ జానకిని చూడడం యెలాగు? చిన్నప్పుడు మేమిద్దరమూ ఆటలు ఆడుకొనేరోజులు యెంతఆనందంగా గడచేయి?

ఈ ఆలోచనలతో సాయంకాలం అతిత్వరితంగా గడచిపోయింది. కొయిలాలు సర్దుకొని

(తరువాయి 14 వ పేజీలో)

(11 వ పేజీ తరువాయి)

యింటికి నడక ప్రారంభించేను. తిరిగి రాళ్లకుప్పల దగ్గిరకు వచ్చేసరికి కూలీలు పన్లుముగించి బటువాడందుకొని, సన్నసన్నంగా యెవరింటికివారు నడక మొదలెట్టేరు. సుత్తి భుజంమీదుంచుకొని, బుర్ర వంచుకొని, ఆ మాసి చినిగినచీరసందుల్లోంచి బంగారం ఛాయగల తన యౌవ్వనశరీర అందాన్ని విరజల్లుతూ, నడుస్తూన్న ఆ పిల్ల వెనువెంబడిని నా కాళ్ళు నన్ను అప్రయత్నంగా లాగేసాయి. పదివేల నక్షత్రములనడుమ, చీకటిని పోగొట్టుచూ, తన అందంఅనే చల్లటి వెన్నెలను తన సహస్రకిరణాలతో విరజల్లుతూ ప్రకాశించే ఆ చంద్రుడే నుదుటవ్రాసిన వ్రాతప్రకారం, ఒకానొకసమయంలో రాహువుచే మ్రింగబడుచున్నాడే! పాపభూయిష్టమైన యీ ప్రపంచంలో నరజన్మయెత్తి అనేక పడరానికష్టాలు పడ్డంకూడా నుదుటవ్రాసినవ్రాతేకదా!

ఏదో పిచ్చిదానివలె తనలోతాను మాట్లాడుకుంటూ నడుస్తూన్న ఆ యౌవ్వనస్త్రీని ఆవచ్చీరాని చీకట్లో ఓ వయౌనపురుషుడు వెంబడిస్తూవుంటే సంఘంచూస్తే యేమనుకుంటుంది? ఏమనుకుంటే నేమిటి? దురాచారాలతోనిండి ఒకరి పచ్చచూచి ఓర్వలేని యీ పాడుసంఘం నన్నేమిచేస్తుంది? ఎంత నడిచినా అంతులేని యీ నాటుదారి యింకాయెంత దూరముందో! ఊరువదిలి అప్పుడే ఒక మైలుదారి కావచ్చింది. ఒకరిముఖం వొకరికి కనుపించకుండా చీకట్లు అమాంతంగా క్రమ్ముకున్నాయి. ఓ పాడుపడిన యిల్లు—ఆ యింటిముందర తోట—తోట దగ్గిరకొచ్చి ఆ దారి హటాత్తుగా ఆగిపోయింది. ఆ నిశ్శబ్దం సమయంలో కాలుచప్పుడికైనా వెనుతిరిగి చూడని ఆ స్త్రీ ఆలోచనాసముద్రంలో మునిగివున్నట్లుగా తోచింది. దించిన బుర్రెత్తకుండానే యింటి తలుపుతీసి, ప్రమిదలోవున్న ఆముదందీపం ముట్టించి గోడకుతగిలించివున్న ఫోటో యెదురుగుండా నిశ్శబ్దంగా నించోంది. ఆ ఫోటో యెవరిది? ఆశ్చర్యం! చిన్నప్పుడుమా నాన్న నాకుతీయించిన ఫోటో యీమె కెలావచ్చింది? ఈ నిర్భాగ్యుని ఫోటోపై యీమె కింతటిప్రేమ యెలావచ్చింది?

ఆ చిన్నఫోటోదగ్గర నించోని "తలిదండ్రులు కాలంచేయటం—దానికితోడు, తోబుట్టువ అన్న ఆ స్తంతా తాగుడు, వేశ్యలక్రింద తగలెట్టి అతి దరిద్రుడవటం—దరిద్రుడైనప్పటికి, యిద్దరం ఒకచోటుండి కూలిచేసి తెచ్చిన సొమ్ములో ఆనందంగా దినాలు గడుపుదామనుకుంటే, కంటికి కనపడకుండా పరారయినాడు. ఇక, నువ్వో—చిన్నప్పటినుంచీ నన్ను యెంతో ప్రేమగాచూస్తూ, నన్నే పెళ్లాడుతానని అంటూండేవాడివే! ఇప్పుడు నువ్వెక్కడున్నావు? ఈ ఆపదసమయంలోనైనా కంటబడి యీ దీనురాలిని రక్షించవా? ఇంక పెళ్ళో! నన్నే! కూలిదాన్నే పెళ్లాడడం! అందనిపళ్లకోసం యెందుకీ ఆశ? ఆశలన్నీ యిదివరకప్పుడే నిరాశలయ్యేయి. ఈ మిలుకుమంటున్న దీపంముందు యీ, నీ చిన్నఫోటో యెంతఅందంగా మెరిసిపోతూంది?" అంటూ కన్నీరు కారుస్తూంది. కన్నీళ్లు చెక్కిళ్లపైనుండి కారుస్తూంటే తామరాకులపై నీటిబిందువుల్లా జల్లని జారేయి. అతి వేగంగా నాగుండె దడదడకొట్టుకోవడం కాళ్లు గజగజ వణకడం మొదలెట్టేయి. గద్గదస్వరంతో "జానకీ" అని కేకేసి గుమ్మందగ్గిర వున్నపాటుగా కూలబడ్డాను. లోనుంచి "రఘూ" అని కేకేసి అమాంతంగా గుమ్మందగ్గిరున్న నాప్రక్క కురికింది. కొంతసేపటి కిద్దరికండ్లలోంచీ ఆనందభాష్పాలు రాలేయి. చీకట్లు వెన్నెలధాటి కోర్వలేకపోయేయి—కాలచక్రం తిరిగింది—ఏళ్లేళ్ల శని వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ చేయిప్పకొని లేవనెత్తేడు—ప్రేమపక్షులిద్దరం ఒకగూటిలోనే చేరేం—